
సాక్షి
బాపట్ల
శనివారం । 20 । జూలై । 2024




కనకదుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: స్థానిక భవానీనగర్‌లోని కనకదుర్గమ్మకు ఆషాఢమాసం సందర్భంగా మహిళలు శుక్రవారం బోనాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వ కు 1143 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 505.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,700 క్యూసెక్కులు విడుదలవుతోంది.



జనాభిమాన జల్లు : వినుకొండ వద్ద జోరువానలోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికేందుకు తరలివచ్చిన జనసందోహం



చల్లని స్పర్శ : సంతమాగులూరులో చిన్నారిని ఎత్తుకుని లాలిస్తున్న వైఎస్ జగన్

జోరువానలో.. జన గర్జన

- జననేత వైఎస్ జగన్‌కు అడుగడుగునా జేజేలు
- గాయపడిన గుండెలకు ఆత్మీయ నేస్తం ఓదార్పు
- బాధిత కుటుంబాలకు నేనున్నానని భరోసా
- పార్టీ శ్రేణుల్లో మనోధైర్యం నింపిన ప్రజా హృదయ విజేత

రాక్షస మూకల దాష్టీకాలపై గళమెత్తిన పల్నాడు

అలజడి రేగిన గుండెలకు చల్లని ఓదార్పై కదిలిన ఆత్మీయ నేస్తానికి అడుగడుగునా పల్నాడు నీరాజనం పలికింది. సర్కారు ఆంక్షలు, బెదిరింపులతోపాటు జోరువాననూ లెక్కచేయక జననేత వెంట తరంగమై నడిచింది. రాక్షస మూకల దాష్టీకాలపై ఉరుమల్లే గర్జించింది. బాధితులకు నేనున్నానని ఎలుగెత్తిన వరాల రేడు వెన్నలాంటి మనసును చూసి మెరుపల్లె మెరిసింది. గుండెలనిండా మనోధైర్యం నింపుకొని దొంగ ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగంపై గళమెత్తింది. ఇకపైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని ప్రతిన బూనింది.



బసికాపురం వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం వేచి ఉన్న మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, కోన రఘుపతి

నరసరావుపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం చేపట్టిన పల్నాడు జిల్లా పర్యటన ఆద్యంతం జయప్రదమైంది. జోరువానలోనూ జననేతకు ఆత్మీయ స్వాగతం పలికేందుకు ప్రజలు రోడ్ల వెంట బారులు తీరారు. సర్కారు ఆంక్షలకు, అధికారపార్టీ బెదిరింపులకూ వెరవక వైఎస్ జగన్ కోసం గంటల తరబడి రహదారులపై నిరీక్షించారు. ఫలితంగా ప్రధాన రహదారుల కూడళ్లు, పల్లెలు అన్నీ జనసంద్రమయ్యాయి.

అద్భుత ప్రజాదరణ మధ్య పర్యటన

వినుకొండ పట్టణంలో తెలుగుదేశం పార్టీ గూండా జిలాని చేతిలో హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని ఓదార్చి, ఆ కుటుంబంతోపాటు పార్టీ శ్రేణుల్లో మనోధైర్యం నింపేందుకు తాడేపల్లి నుంచి బయలుదేరిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు ఏడున్నర గంటల ప్రయాణం అనంతరం సాయంత్రం 5.30 గంటలకు వినుకొండకు చేరారంటే ఆయనపై ప్రజలు ఎంతటి ఆదరాభిమానాలు కురిపించారో అర్థం చేసుకోవచ్చు.

చిలకలూరిపేటలో స్వాగతం

మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి చిలకలూరిపేట చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. నరసరావుపేట రోడ్డు బ్యాంకు కాలనీ వద్ద గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు.

కొండంత భరోసా

ఎట్టకేలకు వినుకొండ పట్టణానికి చేరుకున్న వైఎస్ జగన్ రషీద్ గృహంలోకి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. దారుణం ఎలా జరిగిందో తెలుసుకుని ఓదార్చారు. తానున్నానని భరోసా కల్పించారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇటువంటి దురాగతాలు మళ్లీ జరగకుండా ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా వచ్చే బుధవారం ఢిల్లీలో ధర్నా నిర్వహించి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరుతూ రాష్ట్రపతి, ప్రధానమంత్రికి వినతిపత్రాలు సమర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య(నాని), మాజీ మంత్రులు అంబటి రాంబాబు పాల్గొన్నారు.

వర్షంతో దినదిన గండం

- జిల్లా అంతటా వర్షాలు
- తీర ప్రాంతంలో బలంగా వీస్తున్న ఈదురు గాలులు
- జన జీవనానికి అంతరాయం
- 22 వరకు వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు ఆదేశాలు జారీ
- మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



వర్షాల ప్రభావంతో ఈపూరుపాలెం డ్రెయిన్‌లో నిలిచిన పడవలు

బాపట్ల టౌన్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మూడు రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో జన జీవనానికి అంతరాయం ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా శుక్రవారం 262.4 మి.మీ. వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై నీళ్లు నిలిచాయి. పైనుంచి వరద నీరు తీర ప్రాంతంలోని డ్రెయిన్లకు చేరడంతో ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. వాయుగుండంగా మారిన అల్పపీడనం శుక్రవారం ఒడిస్సా ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. ఈ సమయంలో తీరం వెంబడి గంటకు 70 నుంచి 85 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని ఆ శాఖ అధికారులు హెచ్చరించారు. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులు వేటకు ఈనెల 22వరకు వెళ్లవద్దని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. వాయుగుండం తీరం దాటి సముద్రం యథావిధిగా వచ్చేంత వరకు వేటకు వెళ్లవద్దని సూచించారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు రెండు నెలల పాటు నిషేధంతో మత్స్యకారులు అవస్థలు పడ్డారు. ఇప్పుడిప్పుడే వేటకు పయనమవుతున్న సమయంలో వరుస వాయుగుండాలతో ఆందోళన చెందుతున్నారు. మత్స్యకారుల ఆశలపై వర్షం నీళ్లు చల్లింది.

మెట్ట పంటలకు జీవం

వర్షం మెట్ట పంటలకు జీవం పోసింది. మొన్నటి వరకు వర్షాలు లేక ఎండిపోయిన పైర్లు గత మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా జీవకళ సంతరించుకున్నాయి. మరో మూడురోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతులు ఆకుకూరలు, కూరగాయలు, వేరుశెనగ, మినుము, మిర్చి తదితర పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. సమీపంలో కాలువలు తవ్వి బయటకు పంపించే పనిలో నిమగ్నమయ్యారు. వర్షం మెట్ట పొలాలకు జీవం పోసినా, మాగాణి పొలాలకు సమస్యగా మారింది. పలుచోట్ల మాగాణి పొలాల్లో నీరు నిలిచింది. వారం రోజుల కిందట తీవ్ర ఎండలతో ఉక్కపోతకు గురైన కొందరు రైతులు నారుమడులు పోయాలా..లేదా ? అనే సందిగ్ధంలో ఉన్నారు. మరికొందరు పొలాల్ని దుక్కిదున్ని నారుమడులు పోసేందుకు సిద్ధమవుతున్నారు.

వరదలొస్తే సహాయక చర్యలకు సన్నద్ధం

- జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి
- కృష్ణా పరీవాహక గ్రామాల ప్రజలకు ముందస్తు అవగాహన



పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణా నదికి పడిన గండి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొల్లూరు : కృష్ణా నదికి వరదలొచ్చిన పక్షంలో తీర ప్రాంత గ్రామాల ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలతోపాటు, సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని కలెక్టర్ జె. వెంకట మురళి సూచించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన నిత్యావసర సరకులను కూడా నిల్వ చేయనున్నట్లు తెలిపారు. వరద తీవ్రత అధికమైతే రహదారులు ముంపునకు గురై ప్రమాదం ఉన్న నేపథ్యంలో ముందస్తుగానే గర్భిణులు, బాలింతలు, వృద్ధుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని చెప్పారు. మండలంలోని కృష్ణా నది పరీవాహక గ్రామాల్లో వరదల సమయంలో చేపట్టాల్సిన చర్యల్ని ముందస్తుగా పరిశీలించేందుకు ఆయన జిల్లా యంత్రాంగంతో కలసి శుక్రవారం పర్యటించారు. లంక గ్రామాల్ని పరిశీలించారు. నదికి వరదలొస్తే గ్రామాల్లోకి ప్రవేశించే నీరు, ప్రాథమికంగా నదీ ప్రవాహం గ్రామాల వైపు చొచ్చుకొని రాకుండా చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించారు. పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణా నదికి పడిన గండిని పరిశీలించారు. గండి ద్వారా నీరు కొల్లూరు కరకట్ట వైపునకు ప్రవహించడం ద్వారా మునిగే గ్రామాల సమాచారాన్ని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. పెసర్లంక, కొల్లూరు, ఈపూరు, దోనేపూడి, ఆవులవారిపాలెం తదితర గ్రామాల పరిధిలోని వేలాది ఎకరాల పంట భూములు ముంపుకు గురయ్యే ప్రమాదంతో పాటు రాకపోకలు నిలిచిపోతాయని అధికారులు ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన తక్షణం గండి నుంచి వరద నీటి ప్రవాహం పల్లపు భూముల్లోకి రాకుండా తాత్కాలికంగా మట్టితో అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన అంచనాలు రూపొందించాలని ఆర్‌సీ (రివర్ అండ్ కన్జర్వేషన్) అధికారుల్ని ఆదేశించారు. నది అంచుల వరకు ఇటుకలు తయారీకి అవసరమైన మట్టి తవ్వకాలు చేపట్టడం వల్ల తక్కువ పరిమాణంలో నీరు వచ్చినా పల్లపు ప్రాంతాల్లోకి ప్రవేశిస్తుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అక్రమంగా చేపట్టే మట్టి తవ్వకాలపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామని హామీఇచ్చారు. అనంతరం చిలుమూరులంక, సుగ్గునలంక గ్రామాల్లో పర్యటించారు. వరద వస్తే గ్రామాల్లోకి ప్రవేశించే నీటి గురించి ప్రజల్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదల సమయంలో యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధులు ప్రబలకుండా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ సుబ్బారావు, రేపల్లె సబ్ కలెక్టర్ హేలా షారోన్, కొల్లూరు తహసీల్దార్ పుల్లారావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులకు సత్వర పరిష్కారం

అధికారులకు కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అధికారులు అధిక ప్రాధాన్యతనిచ్చి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై చర్చించారు. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసుల్ని సత్వరమే పరిష్కరించడానికి ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. ఏదైనా ఘటన జరగగానే ప్రాథమిక విచారణతో పాటు నిబంధనల్ని అనుసరించి తక్షణమే చార్జిషీట్ వేయాలని సూచించారు. శ్మశానాలు లేని ఎస్సీ, ఎస్టీ గ్రామాల్ని గుర్తించాలన్నారు. ఆయా గ్రామాలకు కావాల్సిన భూమిపై తక్షణమే నివేదిక ఇవ్వాలని రెవిన్యూ అధికారుల్ని ఆదేశించారు. బాధితులకు భరోసా కల్పించి, తక్షణమే సహాయ సహకారాలు అందించేలా చూస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, చీరాల శాసనసభ్యులు ఎం. ఎం. కొండయ్య, జిల్లా కమిటీ కన్వీనర్ రాజా దిబోరా, కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు, పి. ప్రసాదరావు, టి. సురేష్, జి. రాజారావు, జె. నాగమణి, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బండ్లమ్మకు వెండి పళ్లెం బహూకరణ



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో గల శ్రీ బగళాముఖి అమ్మవారికి భవనంవారిపాలెం శివారు చోడిపాలెం గ్రామస్తులు శుక్రవారం వెండి పళ్లెం బహూకరించారు. గ్రామానికి చెందిన చిరసాని తేజస్వి దివాకర్‌రెడ్డి, చిరసాని వెంకటేశ్వరరెడ్డి, విజయవాడకు చెందిన కాటేపల్లి కేశవులు కలసి 1.498కిలోల బరువున్న రూ. 1.50 లక్షల విలువైన వెండి పళ్లెంను అందించారు. దాతలకు ఆలయ మర్యాదలతో అర్చకులు వేద ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి, భవనంవారిపాలెం గ్రామస్తులు దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మోదుగుల శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: భారత సైన్యంలో నియామకాలకు సంబంధించిన అగ్నివీర్ నోటిఫికేషన్ విడుదలైనట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ పోస్టులకు కనీస విద్యార్హతగా 10వ తరగతి చదివి ఉండాలని, ట్రేడ్స్‌మెన్ పోస్టులకు 8వ తరగతి విద్యార్హతతో పాటు 17 నుంచి 21 ఏళ్ల లోపు అవివాహిత యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ, యువకులు 'జాయిన్ ఇండియన్ ఆర్మీ.ఎన్ఐసీ.ఇన్' వెబ్‌సైట్ నుంచి పూర్తి వివరాలు తెలుసుకుని, దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వీసీగా ఆచార్య గంగాధరరావు బాధ్యతల స్వీకారం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీగా కంచర్ల గంగాధరరావు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైస్ చాన్సలర్‌గా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థుల సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధికి చర్యలు చేపడతానని చెప్పారు. విద్య, బోధన, పరిశోధన రంగాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. ఈ సందర్భంగా వీసీకి పలువురు అభినందనలు తెలిపారు.

పాఠశాలల నిర్వహణలో అప్రమత్తత అవసరం

గుంటూరుఎడ్యుకేషన్: భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించే విషయమై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని డీఈఓ పి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పైకప్పు పెచ్చులూడిన తరగతి గదులు, దెబ్బతిన్న వరండాలతోపాటు చెట్ల కింద విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తరగతులు నిర్వహించరాదని ఆదేశించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, అవసరమైతే ఆయా తరగతులను ఇతర సెక్షన్లతో కలుసుకుని నిర్వహించాలని, ఈ విషయంలో అశ్రద్ధ వహించరాదని ఆమె స్పష్టం చేశారు.

దివ్యాంగ విద్యార్థులకు నేషనల్ స్కాలర్ షిప్స్

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు నేషనల్ స్కాలర్‌షిప్స్ మంజూరు చేస్తోందని , అర్హులు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్. సువార్త శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9,10 తరగతి (ప్రీ మెట్రిక్ విద్యార్థులు), ఇంటర్ ఆపై చదువులు (పోస్ట్ మెట్రిక్ విద్యార్థులు), టాప్ క్లాస్ అభ్యసించే దివ్యాంగ విద్యార్థులు www.depwd.gov.in, httpr://rchoarrhipr.gov.in డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్‌పవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబులిటీస్ వెబ్‌సైట్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

వెల్లువెత్తిన జనాభిమానం



జగన్‌మోహన్‌రెడ్డి కోసం ఎదురు చూస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చిన హనిమిరెడ్డి, నాయకులు

మాజీ సీఎం జగన్‌కు సంతమాగులూరులో ఘన స్వాగతం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): తమ అభిమాన నేత, మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు అభిమానులు, నేతలు, జనం వెల్లువెత్తారు. అద్దరోడ్డు సెంటర్‌లో ఆయన కోసం ఉదయం 11 గంటల నుంచి 2.30 గంటల వరకు వేచి ఉన్నారు. వినుకొండలో హత్యకు గురైన షేక్ రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తూ మార్గంమధ్యలో సంతమాగులూరు మండలం అద్దరోడ్డులో జగన్‌మోహన్‌రెడ్డి ఆగారు. వేచి ఉన్న నేతలు, అభిమానులు, కార్యకర్తలు జనాలకు అభివాదం చేశారు. తమ అభిమాన నేత వస్తున్నాడని తెలుసుకున్న వారంతా వేలాదిగా అద్దరోడ్డు సెంటరుకు ఉదయం 10 గంటలకే తరలి వచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి రాగానే చప్పట్లతో జైజై జగన్.. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

అద్దరోడ్డులో వేచిఉన్న హనిమిరెడ్డి

జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండ వెళ్లే సమయంలో అద్దరోడ్డు వద్ద నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి వేచి ఉన్నారు. ఆయనతో కలిసి భారీగా అద్దంకి నుంచి నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. అక్కడ నుంచి వినుకొండ వెళ్లారు.

వణికిస్తున్న వైరల్ జ్వరాలు

- తాతావారిపాలెంలో కొనసాగుతున్న వైద్య శిబిరం
- ఎనిమిది మందికి డెంగీ, టైఫాయిడ్ లక్షణాలు



తాతావారిపాలెం(భట్టిప్రోలు): సూరేపల్లి గ్రామ పరిధిలోని తాతావారిపాలెంలో వైరల్ జ్వరాలు ప్రబలడంతో పంచాయతీ, వైద్య ఆరోగ్య, మలేరియా శాఖల సిబ్బంది అప్రమత్తమయ్యారు. శుక్రవారం రెండవ రోజు కూడా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 30 మందిని వైద్యులు పరీక్షించారు. ఎనిమిది మందికి డెంగీ, టైఫాయిడ్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. నీరసంగా ఉన్న వారికి సెలైన్లు ఎక్కిస్తున్నారు. ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టుల ఆధారంగా వ్యాధి నిర్ధారణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరం బాధితుల్ని గుర్తిస్తున్నారు. పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మైక్ ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. పారిశుద్ధ్య పనుల్ని సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రావు రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి టి. అనూరాధ పర్యవేక్షిస్తున్నారు. డెంగీ అనుమానం ఉన్న ఇళ్లలో రేపల్లె మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు మలాథియాన్ స్ప్రే చేయించారు. గ్రామానికి చెందిన ఓ మహిళ శుక్రవారం గుంటూరులో చికిత్స పొందుతూ మృతి చెందింది. డెంగీతోనే మృతి చెందిందనే వార్త గ్రామంలో దావానంలా వ్యాపించింది. ఆమెకు బీపీ, షుగర్ అధికం కావడంతో కిడ్నీ ఫెయిల్ కావడంతో మృతి చెందినట్లు తెలిసింది. కరోనా సమయంలో గ్రామంలో ఎటువంటి కేసులు నమోదు కాలేదని, అయితే వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఇటీవల పైప్‌లైన్ లీక్ కావడంతో మురుగు నీరు చేరి వ్యాధుల బారిన పడ్డామని వాపోతున్నారు.

ఆయకట్టు అధ్వానం... సాగు ప్రశ్నార్థకం

- ఆధునికీకరణను పట్టించుకోని ప్రభుత్వం
- ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో పంట కాలువలు
- ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసిన రైతులు
- మరో 15 రోజుల్లో ప్రారంభం కానున్న వరినాట్లు
- కనీసం పూడికతీతకు కూడా నోచుకోని కాలువలు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



గండ్లు పడిన వల్లువారిపాలెం పంట కాలువ



ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉన్న న్యూ ముత్తాయపాలెం చానల్



వెస్ట్ బాపట్ల చానల్ దుస్థితి

బాపట్ల టౌన్: రైతుల అభ్యున్నతే ధ్యేయం.. అభివృద్ధి పథంలో నడిపిస్తామంటూ ఎన్నికల ముందు సభలు, సమావేశాల్లో ఊదరకొట్టిన కూటమి నేతలు అధికారం చేపట్టాక మొహం చాటేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత రైతుల అభ్యున్నతి దేవుడెరుక... కనీసం పొలాలకు సాగునీటిని అందించే పంట కాలువల్లో పూడికతీత కూడా చేపట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అసలే కాలువల ద్వారా ప్రస్తుతం అరకొర నీరు మాత్రమే సరఫరా అవుతోంది. దీనికితోడు చిల్ల చెట్లు, ముళ్ల పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆయకట్టు ప్రాంతాల్లోని పొలాలకు సాగునీరు అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

పిచ్చిమొక్కలు తొలగిస్తే ఒట్టు

కాలువల ఆధునికీకరణ, అభివృద్ధి మాట అటుంచి కనీసం పూడికతీత, విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కలు కూడా తొలగించే నాథుడే లేడు. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌కు నెలరోజుల ముందే అధికారులు కాలువల్లో జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం కనీసం చెత్తాచెదారాలను కూడా తొలగించలేదు. ఎగువ భాగంలోని రైతులు విచక్షణారహితంగా చెత్తాచెదారం నిల్వల్ని పంట కాలువల్లో పోసి డ్రైనేజీల కన్నా అధ్వానంగా తయారు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఏడాది సాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందో, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాలువల అభివృద్ధి జరిగేనా ?

కృష్ణా పశ్చిమ డెల్టాలోని కొమ్మమూరు కాలువకు ఏటి ఒడ్డు ఉప్పరపాలెం లాకుల నుంచి సాగునీరు సరఫరా అవుతుంది. ఈ కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని అధికారులకు రైతులు పలుసార్లు తెలియజేశారు. ఓ వైపు వ్యవసాయ పనులు ప్రారంభమైనప్పటికీ స్పందించక పోవడంతో సుమారు 850 ఎకరాలకు సాగునీటిని అందించే ప్రధాన కాలువలో ఎనిమిది కిలోమీటర్ల మేరా రైతులే స్వచ్ఛందంగా పొక్లెయిన్‌తో తవ్వించారు.

- కొమ్మమూరు కాలువల నుంచి అప్పికట్ల సమీపంలో పాయగా చీలే పీటీ చానల్ బాపట్ల మండలంలోని నందిరాజుతోట, పిన్నిబోయినవారిపాలెం, కప్పలవారిపాలెం మీదుగా కర్లపాలెం మండలం, పిట్టలవానిపాలెం మండలంలోని కొంత భాగం వరకు సాగునీటిని అందిస్తుంది. ఈ కాలువలో నేటికీ పూడికతీత పనులు చేపట్టలేదు.
- బాపట్ల మండలంలోని ఆర్ మండల్, న్యూ ముత్తాయపాలెం, వెస్ట్ బాపట్ల చానల్, బంకింగ్ కెనాల్ పరిధిలోని మేజర్, మైనర్ కాలువలు కూడా అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం నిల్వలు, పిచ్చిమొక్కల్ని తొలగించాలని, లేనిపక్షంలో ఈ ఏడాది సాగు ప్రశ్నార్థకమేనని రైతులు కోరుతున్నారు.

టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం

రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదు. కాలువల ఆధునికీకరణపై అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదిక అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ

పంటలు పండించడం కష్టమే



గతంలో వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్న సమయంలో పంట కాలువలను తవ్వించేవారు. దీంతో వచ్చిన అరాకొర నీరైనా ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు కూడా అందేది. ఈసారి పనులు చేపట్టకపోవడంతో అగమ్యగోచరంగా ఉంది. కాలువలు ఈ విధంగా వదిలేస్తే ఈ ఏడాది పంటలు పండించడం కష్టమే.

– పాగోలు బాబు, గులాంహుస్సేన్‌తోట

అధికారులు పట్టించుకోవడం లేదు



వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే వారం రోజుల క్రితమే నార్లు పోశాం. మరో 15 రోజుల్లో నాట్లు వేసుకోవాలి. కనీసం కాలువలో పార మట్టి కూడా తీయలేదు. ఇలా ఉంటే సాగు ఎలా చేసుకోవాలి అంటూ అధికారులకు రైతులందరం చెప్పాం. చేయిస్తాం...చేయిస్తాం అని చెబుతున్నారే గానీ కాలువలను మాత్రం అభివృద్ధి చేయడం లేదు. అధికారులు స్పందించి పనులు వెంటనే మొదలు పెడితే మాకు ఉపయోగంగా ఉంటుంది.

– చేజర్ల వెంకటేశ్వర్లు , వల్లువారిపాలెం

గండ్లతో కడగండ్లు



పంట కాలువలకు చాలా చోట్ల గండ్లు పడ్డాయి. పూడ్చకుండా వదిలేస్తే వచ్చే కొద్దిపాటి నీరు గండ్లు పడిన ప్రాంతాల్లోని పొలాల్లోకి వెళుతుంది. చివరి భూములకు చుక్కనీరు కూడా రాదు. అధికారులు స్పందించి వెంటనే మొదలు పెడితే రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

– ఏమినేని శ్రీనివాసరావు , గులాంహుస్సేన్‌తోట

సివిల్స్ శిక్షణార్థులకు ఉచిత హాస్టల్ వసతి

గుంటూరు ఎడ్యుకేషన్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు, సివిల్స్ విజేత డాక్టర్ జి.వివేకానంద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు వసతి ఖర్చులు అదనపు భారం కారాదనే సామాజిక బాధ్యతతో సేవలందిస్తున్న శ్రీకాకతీయ ఎడ్యుకేషనల్ అకాడమీ సహకారంతో 90 మందికి ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులకు సివిల్స్‌లో ర్యాంకుల సాధనే లక్ష్యంగా ప్రారంభిస్తున్న రెసిడెన్షియల్ క్యాంపస్‌లో మెరిట్ ప్రాతిపదికన యువతీ, యువకులకు చెరో 45 సీట్లు చొప్పున కేటాయిస్తామని తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆశావహులు ఉచిత హాస్టల్ వసతి కోసం తమ పూర్తి వివరాలను 98660 74047 నంబర్‌కు వాట్సాప్ చేయాలని ఆయన సూచించారు.

కలెక్టర్‌కూ తప్పని కుదుపుల ప్రయాణం

- కొల్లూరు మండలం కృష్ణానదీ పరీవాహక గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ వెంకట మురళి
- చెరువులను తలపించిన రహదారులపై వాహనాలు కదలక అవస్థలు
- గ్రామస్తుల వినతిపై మరమ్మతులకు కలెక్టర్ అంగీకారం



పెసర్లంక వద్ద చెరువును తలపిస్తున్న రహదారిపై వెళుతున్న కలెక్టర్ వాహన శ్రేణి

కొల్లూరు : తటాకాలను తలపిస్తూ అగాధాలతో కూడిన రహదారిలో జిల్లా కలెక్టర్‌కు సైతం కుదుపులతో కూడిన ప్రయాణం తప్పలేదు. కొల్లూరు మండలం కృష్ణా నదీ పరీవాహక గ్రామాలలో వరదల సమయంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ జె.వెంకట మురళి మోకాలు లోతు గుంతలతో చెరువుల్లా మారిన మార్గంలో శుక్రవారం అష్టకష్టాలు పడుతూ ప్రయాణించాల్సి వచ్చింది. 13 లంక గ్రామాలకు ఏకైక ప్రధాన మార్గం అధ్వానంగా మారడంతో ప్రజలకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. సుమారు 3 కిలోమీటర్ల దూరాన్ని అధికారుల వాహనాలు 10 నిమిషాల్లో చేరుకోవాల్సి ఉండగా, ప్రస్తుత వర్షాలకు రహదారి అస్తవ్యస్తంగా మారింది. మొత్తం భారీ గోతులతో నిండి ఉండటంతో జిల్లా కలెక్టర్, అధికారుల వాహనాలకు దాదాపుగా 30 నిమిషాలు సమయం పట్టడం రహదారి దుస్థితికి అద్దం పడుతోంది. ప్రయాణం ప్రాణాంతకంగా మారిన రహదారిలో ప్రయాణించిన కలెక్టర్‌కు పెసర్లంకలో ప్రజలు ప్రయాణ కష్టాలను ఏకరవు పెట్టారు. రహదారి మెరుగు పడాలంటే డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కలెక్టర్ వారికి తెలిపారు. పంచాయతీ నిధులు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు సరిపోవని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. రహదారి నిర్మాణం చేపట్టి నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేసి కష్టాల నుంచి గట్టెక్కించాలని గ్రామస్తులు వేడుకున్నారు. కొల్లూరు కరకట్ట మార్గం సైతం కొంత మేర అధ్వానంగా మారడంతో ప్రయాణం ప్రాణాంతకంగా ఉందని ఆయనకు తెలపడంతో అధికారులతో చర్చించి మెరుగుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో తమ గ్రామాన్ని ఆనుకొని ఉన్న కృష్ణా నదిలో ట్రాక్టర్ల ద్వారా తరలించేందుకు అనుమతివ్వాలని కోరారు. దీనికి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్ల నుంచే ఇసుక రవాణా చేసుకోవాలని స్పష్టం చేశారు.

గ్రామాల్లో సక్రమంగా వైద్యసేవలు అందించాలి

జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యురాలు పద్మజ



ఈపురుపాలెంలో పర్యటిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రతినిధులు

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సక్రమంగా వైద్యసేవలందించి, ఆరోగ్యవంతులుగా ఉంచాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యురాలు పద్మజ సూచించారు. మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని సబ్‌సెంటర్-3ను శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది.డయేరియా రాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తల్ని ప్రజలకు వివరించారు. ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో వివిధ రకాల వైద్య సేవలు పొందుతున్న గర్భిణులు, బాలికలు, కిశోర బాలికలకు సిబ్బంది రక్త పరీక్షలు చేశారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను రికార్డుల్లో నమోదు చేసి, సకాలంలో వైద్య సేవలు అందించేలా చూడాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్‌లు, సూపర్‌వైజర్లుతో పాటు గ్రామాల్లో ఆశాలు, ఆరోగ్య సిబ్బంది విధుల్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

'అగ్రి'గండంలో అన్నదాత

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతుల్ని వర్షాకాలంలో మురుగు కాలువల సమస్య వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఈ ఖరీఫ్‌లో వరికి ముంపు బెడద తప్పేలా లేదు. తీరంలో నెలల తరబడి కష్టించిన రైతులకు పంట చేతికొచ్చే సమయంలో వర్షం కురిసిందంటే గుండెల్లో రాయిపడినట్లే. డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటికాడ సమస్య పెను విపత్తుగా మారింది. పంట చేతికొచ్చే సమయంలో ఆకస్మికంగా కురిసే వానలతో పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు బయటకు పోయే పరిస్థితులు లేవు. పంటలు మునిగిపోయి రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల ప్రభుత్వంగా వారి కష్ట సుఖాలను ఎరిగి ఎన్నో సమస్యల్ని పరిష్కరించింది. ఖరీఫ్‌కు ముందే డ్రెయిన్‌లలో తూటికాడ, గుర్రపు డెక్కలను తొలగించించేది. అయితే, ప్రస్తుత కూటమి నేతలు ఈ సమస్యపై దృష్టి సారించక పోవడంతో తీరంలో రైతుల్ని భయాందోళనలకు గురిచేస్తోంది.



ఓల్డ్ టౌన్ వద్ద గడ్డితో పూడుకుపోయిన వాడ మురుగు డ్రెయిన్

- ఖరీఫ్‌కు తప్పని ముంపు బెడద
- గుర్రపు డెక్క, తూటికాడతో పూడుకుపోయిన డ్రెయిన్లు
- పూడిక ఊసెత్తని కూటమి నేతలు
- గతంలో ఖరీఫ్ ముందే పూడికలు తీసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

రేపల్లె రూరల్: రేపల్లె సబ్ డివిజన్‌లో ప్రధానమైన ఆర్‌ఎం, బీఎం, వాడమురుగు డ్రెయిన్లతో పాటు జగజ్జేరువు కాలువ, రేపల్లె మురుగు కాలువ, రేపల్లె న్యూకోర్స్, ఓల్డ్ కోర్స్‌లు తూటికాడ, గుర్రపు డెక్క, ప్లాస్టిక్, చెత్తా చెదారాలతో పూడుకుపోయి కుచించుకుపోయాయి. చుక్కనీరు కిందకు పారే పరిస్థితి లేదు. వర్షాకాలంలో వీటి ద్వారానే పంట పొలాల్లో వర్షపు నీరు బయటకు పోవాల్సి ఉంది. రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, రేపల్లె మండలం, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలలో 34,060 హెక్టార్లలో ఖరీఫ్‌లో వరి సాగవుతోంది. ఈ భూముల్లో వృథా నీటితో పాటు అధిక వర్షాలు కురిసిన సమయంలో నీరు ఈ ప్రధాన మురుగు కాల్వల ద్వారానే పారుదల కావాల్సి ఉంది. సాధారణంగా పంట చివరి దశ అయిన నవంబర్, డిసెంబరు మాసాల్లో ఈ ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదవుతుంది. ఆ సమయంలో నీటి పారుదల సక్రమంగా లేకపోతే పంట ముంపునకు గురై తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు భయపడుతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

ఇప్పటికే తొలకరి వానలు విస్తారంగా కురవడం ప్రారంభమయ్యాయి. రైతులు కూడా ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. అయితే, ఇప్పటికీ కూడా ప్రభుత్వం డ్రెయిన్ పూడిక పనులు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యుద్ధప్రాతిపదికన డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పనులు వెంటనే ప్రారంభించాలి



డ్రెయిన్లు పూడిపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో పంటలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గుర్రపుడెక్క, తూటికాడలతో పాటు కాలువల్లో చెత్తను తొలగించాలి. అప్పుడే పొలాల్లో వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అధికారులు వెంటనే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలి.

– ఏడుకొండలు, రైతు, గుడ్డికాయలంక, రేపల్లె మండలం

చిన్నపాటి వర్షం కురిసినా తీరని నష్టం



పంటలు ముంపునకు గురికాకుండా డ్రెయిన్లలో పూడికలు వెంటనే తీయించాలి. పంట చేతికొచ్చే సమయంలో చిన్నపాటి వర్షం కురిసినా పొలాల్లో నీరు నిలిచిపోతోంది. ఈ గండం గట్టెక్కాలంటే వర్షాలు తీవ్రం కాకముందే డ్రెయిన్‌లలో పూడికతీత తీయించక తప్పదు. అధికారులు వెంటనే పనులు మొదలెట్టాలి.

–ఈమని దావీదు, రైతు, గుళ్లపల్లి, చెరుకుపల్లి మండలం



గుడ్డికాయలంక అక్కిలేరు వద్ద రేపల్లె మెయిన్ డ్రెయిన్ దుస్థితి



నేతాజీ నగర్ వద్ద గుర్రపు డెక్కతో నిండిన వాడ మురుగు డ్రెయిన్

టెండర్ల ప్రక్రియ పూర్తి

రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ప్రధాన మురుగు కాలువల్లో పూడికలు తీయించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. సాధ్యమైనంత త్వరలో పనులు ప్రారంభించి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌కుమార్, డ్రైనేజ్ డీఈ